
# దుర్భిణి

సి.వి. నారాయణరావు

రంగడికి చాలా విషయాలు తెలుసు — చదువు రాకపోయినా... సంతకం పెట్టడం తెలియక పోయినా. వాడి తెలివి తేటలు వేరు తరచిచూస్తే వాడి జీవితం అందరిలాంటిది కాదేమో అనిపిస్తుంది.

జీవితం బడిలో ఎదురైన అనుభవాలు, ఆఅనుభవాలతోపాటు నేర్చుకున్న గుణ'పాఠాలూ' కలబోసిన జీవితం రంగడిది.



అంతేగాదు, రూపాయ బిళ్ళ ఎగురవేస్తే ఎప్పుడూ బొరుసే పడే వాడి జీవితంలో మొదటి సారిగా బొమ్మ పడింది.

వాడి మనోనేత్రం తెరుచుకోవడంతో పరిస్థితులను అర్థం చేసుకునే శక్తి వచ్చింది. తనను తాను అసహ్యించుకునేటంతగా ఎదిగిపోయాడు.

"ఛీ" అని తనను తానే ఛీదరించుకునే వరకూ : "నాకు ఇరవైయ్యేళ్ళంట ... ఒరే యెదవా... ఒరే గాడిదా... దున్నపోతులాగున్నావ్... అడుక్కు తిని బతక్కపోతే ఏదైనా కష్టం చేసుకుని బతకొచ్చుగదరా గాడిదా..."

ఆ శాపనార్థాలు తనకు నచ్చలేదు.

తను దున్నపోతా !

పుల్లాకులు ఏరుకుతిన్నప్పుడు షడ్రుచులూ తెలిసొచ్చాయి.

వేరే ఖర్చు లేదుగా బట్టి —— తనకు నీడ రైలు స్టేషను ప్లాట్ ఫారం తను నిద్రపోయేదీ అక్కడే — అడుక్కుని సంపాదించిన దాన్లోనే ఎన్ని ఐస్ క్రీములు తను తినలేధు ఎన్ని కూల్ డ్రింకులు తాగలేదు... కష్ట పడి పనిచేస్తే ఆ విధంగా తను బ్రతకలేడు కావల్సింది కావల్సినప్పుడల్లా అందుకోలేడు.

అందుకనే తన పనిని మానలేకపోతున్నాడు —— అదే అడుక్కు తినడం.

అయినా దానధర్మాలు చేసే వాళ్లు మునపటి లాగా ఆదరం చూపడం లేదు. ముఖం చిట్లిస్తూ విసుక్కుంటూ కసురుకుంటూ, నసుక్కుంటూ ధర్మం చేస్తున్నారు. అందుకేగా తన రాబడి తగ్గిపోయింది —— రోజూ ఏదో ఒక రైలెక్కి తిరుపతి దాకా వెళ్ళి తిరిగొచ్చేసరికి తన ఖర్చులన్నీ పోను ఎంతలేదన్నా ఇరవై రూపాయలు మిగిలేవి.

ఇప్పుడు అయిదారు కంటే ఎక్కువ మిగలడం లేదు.

దాంతో పాటు శాపనార్థాలు.

అవి మాటలా ... కాదు, తన గుండెల్ని పరపర కోస్తున్న రంపాలు.


అయితే తన తండ్రి మాటలు ఊరట కలిగించేవి. "ఒరే... ఒళ్ళంతేరా ... అట్టాగే అంటాఉంటార్రా... మనం పట్టించుకోగూడ్దు... దరమం సేత్తే పున్నెవొస్తదని ఒళ్ళకు బాగా తెలుసురా. అంధుకనే యిసుక్కున్నా నసుక్కున్నా అంతో యింతో దరమం చెయ్యకుండా పోరు"

అదీ నిజమే !

అయినా ఎందుకనో కండలు తిరిగిన తన శరీరాన్ని మొదటి తరగతి ప్రయాణీకుల గదిలోని స్నానాల గదిలో స్నానం చేస్తున్నప్పుడు అద్దంలో చూచుకుంటూంటే అడుక్కుతినడంబాగాలేదని పించింది.

అంతే ! ఒక తీర్మానానికి వచ్చేశాడు ఇక అడుక్కు తినగూడదని.. కష్టం చేసి సంపాదించిన దాంతోనే సర్దుకుపోవాలనీ !

అయితే ఒకటి మాత్రం నిజం. అనుకున్నప్పుడల్లా ఐస్ క్రీములూ, కూల్ డ్రింకులూ దొరకవు. రోజూ సినిమా చూసేందుకూ వీలుగాదు !



చలం : మా ఆవిడ పేరు 'ముత్యం'. అందుకని పుట్టిన రోజు పండక్కి 'ముత్యాలహారం' కొనిచ్చా.
వెంకన్న : మరి మా ఆవిడ పేరు 'కొండమ్మ' కదా !

అంతటి హాయైన జీవితాన్ని వదిలిపెట్టి తను సాధించేదీ అంతంతమాత్రమే.

తనకు ప్రపంచం తెలియందేంగాదు.

అడుక్కు తినడం కోసమే తనను గన్న తల్లి. తనను చంకనేసుకుని "అయ్యా... అమ్మా... పిల్లోడికి పాల్లేవమ్మా... దరమం చెయమ్మా" అని యాచించిన తన తొలి బాల్యం నుంచీ అడుక్కోవడం తెలుసు. పెరిగే కొద్దీ యాచించడాన్ని అర్థం చేసుకుంటూ వస్తున్నాడు.

అడుక్కుతినే తల్లిదండ్రుల కడుపున పుట్టిన తానూ అడుక్కుతినే వాడే అయ్యాడు.. రాజయ్యాడా.. మంత్రయ్యాడా... కనీసం రాజదర్బారులో ద్వారపాలకుడైనా కాలేదే ! అదంతేనట...తనకు నచ్చిన పంతులుగారు హరికథ చెప్పేటప్పుడు చెప్పాడు... అంతాపూర్వజన్మ సుకృతం అట ! తనకు అటువంటి నమ్మకాలున్నాయి!! అప్పుడప్పుడూ అవి మంచివిగానే అగుపిస్తున్నాయి గూడా—— ఎందుకంటే అవి మానసిక ధైర్యాన్ని కలిగిస్తాయి కాబట్టి!!!

నిజంగా రంగడు మానసిక మేధావే!

లేకపోతే అందరూ సాధారణంగా వదిలివేసే విషయాలను వాడు పట్టించుకుని అంత తీవ్రంగా ఆలోచించడు!

జీవితాన్ని నిలబెట్టుకోవాలనే ఆలోచన రావడం వాడు ఎగురవేసిన రూపాయబిళ్ళకు మరోసారి బొమ్మ పడటం.

అయితే ఆ బొమ్మప్రేమ, అభిమానం, అనురాగం అనే మానసిక సంచలనాలతో పాటు కామోద్రేకం అనే రోగం —— సహజమైన అనివార్యమైన రోగంతో పాటు ఆకర్షణీయంగా అగుపించింది.

వాడి జీవితాన్ని పట్టుకోడానికి విధి విసిరిన వల ఎవరో గాదు ఓ అందాల భరిణె —— చిట్టి.

చిట్టికి రంగడికీ ఒక్కదాన్లో మాత్రం పోలిక లేదు —— అది అందరి మనిషి.

రంగడికున్నట్లే రైలు స్టేషను ప్లాట్ మే దాని ఇల్లూ వాకిలీ.

"రేయ్ రంగా, నువ్వు మద్దె నిసేదం ఆడాళ్ళతో తిరగతావుండి నీ పోటా పేప్రిలో పడ్డ కాణ్ణుంచి నువ్వంటే నాకు భలే నచ్చినవ్" అని ఎప్పుడైతే చిట్టి అన్నదో అప్పుడే రంగడి మనసుకున్న ఆరు కవాటాలూ ద్వారాలు తెరుచుకున్నాయి. —— కామక్రోధాలైన అరిషడ్వర్గాలు !

అసలు మద్య నిషేదానికీ తనకూ ఏ సంబంధం లేదు పంతులొచ్చి చెప్పేదాకా. "ఒరేయ్ ఇటూ అటూ తిరగడం నీకలవాటే గదా ఆ మద్య నిషేధం ఆడాళ్ళతో కాసేపు తిరగరాదట్రా పుణ్యం, పురుషార్థమూను" అన్నాడు.

ఎందుకనో పంతులు మాటంటే తనకు వేదవాక్కు. అయితే చిట్టి సలహా గూడా తీసుకున్నాడు. మెల్లమెల్లగా అది తన నెత్తిమీదికి చేరుకుంటోందని మాత్రం వాడికి తెలియదు. ప్రేమ గుడ్డిది గాదని ఎవరంటారు.

చిట్టి వాణ్ణి ప్రోత్సహించింది. "ఎళ్ళి తిరుగు. బాగా అరువు. మీ నాన్నకూ బుద్ధి రావాల" అంది, ఎంత బాగా అరిస్తే అంత పేరొస్తుందని సమర్థిస్తూ.

"అయితే మన పెళ్ళో ?" అన్నాడు అదను దాటి పోగూడదనుకున్న రంగడు.

"చెప్పానా ఎయ్యి రూపాయలు, వారం నగలు ఓరు నాకు పెడతారో ఓణ్ణే పెళ్ళాడ్తానని" అంది చిట్టి. ".ఒస్ అంతేనా" అని మరుక్షణంలోనే "పెబుత్తం మద్దెనిసేదం యిదించాల..... లేకపోతే ఆడోళ్ళ ఉసురు తగిలి పెబుత్తం పడిపోద్ది," అని గొంతు చించుకుని అరుస్తూ ఆడవాళ్ళ ముందు నిలబడ్డాడు.

ఆడవాళ్ళతో పాటు పత్రికల్లో తన ఫోటో గూడా పడ్డది.... తనే ప్రధాన ఆకర్షణగా.

ఫోటోలో తను ఎంత దర్జాగా అగుపించాడంటే అచ్చం "సినిమా తారు" లాగా.

మొత్తంమీద వాడి ఆనందం ఇంతా అంతా గాదు. తనను చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, రాజశేఖర్ లాంటి సినీ నటులతో పోల్చుకున్నాడు.

అంతకంటే మహదానందం మరొకటి తనకు లేదన్నట్లుగా.

మరి. ఎవరి అదృష్టాన్ని ఎవరు చూడగలరు !

అదేంటో మద్య నిషేధం ఆడవాళ్ళు తనను మరీ గౌరవించారు. తానొక అడుక్కుతినే వాడని వాళ్ళకు తెలీదా ? తెలుసు.

అవసరం మరి.

అవసరం పడితే ఏ పనైనా చేసెయ్యడం మానవుల బలహీనత ! అది తనకు బాగా తెలుసు. హరికథలు పంతులు చెప్పగా విన్నప్పుడు అటువంటి బలహీనతకు ఎన్నో ఉదాహరణలు తనకు అగుపించి మనసులో నాటుకున్నాయి. "వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకోలా ?.... యిందురుడు కోడై కొక్కొరొ

క్కోమని కుయ్యాలా ఓ ఆడదాన్ని అనుబగించను ?.... రావుడు దొంగ సాటుగా బానం యేసి ఓలిని సంపలా ?....

ఓ యబ్బో.... అట్టాంటోళ్ళే అట్టా జేస్తే తనెంత ?

అవసరం పడితే తనూ ఏదైనా చెయ్యొచ్చు. అదే నీతి.

వాడి మనసును మరోసారి గిలకొట్టింది చిట్టి.

"ఇయ్యాల నువ్వు నన్ను బాలకిస్న సిన్మాకు తీస్కపోవాల."

అట్టాగే, మరి మన పెళ్ళో ?"

"ఎయ్యి రూపాయలు ముందియ్యి, తరాత వారం నగలు తీస్కరా. మన పెళ్ళవుద్ది."

"పెళ్ళయిన మాక యిాళ్ళు పిలిస్తే ఓళ్ళు పిలిస్తే నువ్వు పోగూడ్దు....ఆ..."

"అట్టాగే".

రాత్తిరి టీసీ పిల్చిండంటగా"

ఆ పిల్చిండు. ఎల్లినా. నన్నునుబగించి పది రూపాయలిచ్చిండు."హాయిగా సమాధానం చెప్పింది చిట్టి.

ఆ మాటలతో మరో సారి గట్టి నిర్ణయానికొచ్చాడు. రంగడు. అమ్మయ్యేది ఆడదే. మగాడు గాదు. సిట్టీ ఆడదే. అది ఇట్టా అట్టా బతకడానికి యిాల్లేదు. నేనే దాన్ని పెళ్ళాడి దాన్ని మంచి సంసారిగా మార్చేస్తా.... ఆ"

ఆవేశంతో ఊగిపోయాడు రంగడు.

అయితే పరిస్థితులు ఆవేశానికే కాదు. కాలగతికీ ఆగేవి కావని వాడికి అర్థంగాలేదు. పంతులుగారి హరికథల ద్వారా ఎన్ని విషయాలు అర్థం చేసుకున్నా.

పరిస్థితులు అనుకూలించినట్లే అనుకూలించి కొంపముంచుతాయనే సంగతీ వాడికి తెలీదు.

అప్పటికి వాడికి తెలిసిందల్లా చిట్టిని ఓ సంసారిగా చేసి కాపాడాలనే !

"రేయ్" ——— పంతులు పిలుపు.

తిరిగి చూచాడు రంగడు.

వాడి కళ్ళు ఒక్కసారిగా జిగేలు మన్నాయి.

పంతులు పక్కన ఓ ఆడ మనిషి ఓ చిన్నపిల్లను ఎత్తుకుని నిలబడి ఉంది. ఆమె కవతల ఆడగుంపు కొత్త బట్టల్లో ఏదో పెళ్ళికి వెళ్ళుతున్నట్లుగా వుంది.

"రేయ్ రంగా..... తిరపతి పోదాం రారా. ఈ పిల్లకు పెళ్ళి" అన్నాడు పంతులు.

"ఈ పిల్లకా ?" అన్నాడు ఆశ్చర్యంగా రంగడు ఆ పిల్ల ఒంటినిండా పెట్టివున్న నగలవైపే చూస్తూ" శానా సిన్నపిల్లే !"

" ఆ చిన్నతనంలోనే పెళ్ళి చెయ్యడం వాళ్ళ ఆచారం. ఆ సంగతులన్నీ నీకెందుగ్గానీ, నాతోరా పదో పాతికో దొరుకుతుంది.

"అట్టాగే"

"అయితే ఈ పిల్ల నెత్తుకో. ఈమె నీ వెంటనే వుంటుంది".

తన సంగతి రొట్టెవిరిగి నేతిలో పడిందనుకున్నాడు రంగడు.

వాడి రూపాయ బిళ్ళకు మళ్ళీ బొమ్మే పడింది.



ఒక వ్యక్తి తన కళ్లని పరీక్షిస్తున్న డాక్టర్ని "డాక్టర్ ! నేను కళ్లజోడు పెట్టుకుంటే ఏదైనా కూడా చదవగలనా?" అడిగాడు.

"ఆ చక్కగా చదవగలరు" చెప్పాడు డాక్టర్.

"హమ్మయ్య ! బతికిపోయాను. ఇన్నాళ్లు నాకు చదువు రాదనే బాధతో కుమిలిపోయాను" అన్నాడా వ్యక్తి సంతోషంగా.

పేరూరు అమ్మిన శ్రీనివాసరాజు

బొరుసుగాదు.

బొమ్మల్లాంటి ఆలోచనలూ వాడిలో సుళ్ళు తిరిగాయి. "ఈ పిల్లను యిాళ్ళ నుంచి తప్పించినా నంటే చాలు సిట్టికోరిన ఏడువారాల నగలూ దొరికినట్లే !"

తిరుపతి పాసింజరొచ్చింది.

మళ్ళీ కదిలింది. ఆలోపలే చిట్టి వాడికగుపించింది.

పెళ్ళి వాళ్ళతోపాటు నగలున్న పెళ్ళి కూతుర్నెత్తుకుని పెట్టెలోకి ఎక్కబోతూంటే "యాడికి రా" అన్న చిట్టిగొంతు వినిపించింది.

"తిరపతికి. సాగింతరానికల్లా నీ ఎయ్యి రూపాయలూ ఏడోరాల నగలూ తీస్కొస్తా !" అన్నాడు రంగడు.

చిట్టి పెళ్ళి కూతురి వైపు చూచింది.

"రేయ్ ... నీ మనసులో ఏదో యెదవ బుద్దుందిరా !" అంది చిట్టి.

పాసింజరు కదులుతూంటే ఎక్కిన రంగడికి ఆ మాటలు వినిపించలేదు.

సౌత్ స్టేషను.

వేదాయపాళెం.

మనుబోలు — ముచ్చటగా మూడు స్టేషన్లు దాటింది పాసింజరు.

మరో పదినిముషాలకు గూడూరు జంక్షనొస్తుంది.

ఆడవాళ్ళు మంచినీళ్ళకని ఎటుతిరిగీ దిగుతారు.

ఆ సమయంలో తన పని అయిపోవాలి.

పెళ్ళి కూతుర్ని లెట్రిన్‌లోకి దాటేసి నగలు వలుచుకుని ... వలుచుకుని ...

రంగడి బుద్ధి పెతమార్గం పట్టింది.

అంతపనీ చెయ్యక తప్పదు మరి.

అన్యాయం అయిపోతున్న చిట్టి బాగుపడాల.

ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోకపోతే మరికరాదు.

నగలులేని పిల్లను చూచి పెళ్ళివాళ్ళూరుకోరుగా బట్టి ఆ పిల్ల వాళ్ళకగుపించగూడదు.

అందుకు తనేం చెయ్యాలి ...

తనేం చెయ్యాలి ...

గొంతు పిసికి లెట్రిన్‌లోనే పడేసి తను తప్పించుకుంటే సరి.

అంతపనీ చెయ్యాలా?

రంగడి మనసు కాసేపు గింజకుని స్థిరపడింది.

తప్పదు మరి ... చిట్టి బాగుపడాల ... చిట్టి బాగుపడాల ... చిట్టి ...

అంతే ఉన్నట్టుండి ఏదో పెద్ద శబ్దం ... ! !

రైలు పెట్టె ఒక్కసారి ఆకాశంలో కెగిరి కిందపడి నంత పనైంది.

హాహాకారాలు ఒక్కసారి మాత్రమే రంగడి చెవులకు వినిపించాయి.

* * * *

రంగడు కళ్ళు తెరిచి చూచేసరికి ఎదురుగా పంతులగుపించారు. "రంగా ... నాయనా రంగా ... రైలు ప్రమాదంలో నీ రెండు కాళ్ళూ పోయాయిరా నాయనా ... గద్గద స్వరంతో పలికాడు.

ఆయనవైపు మౌనంగా చూచిన రంగడు తన కాళ్ళ వైపు గూడా చూసుకోకుండా "ఆపిల్లేది?" అన్నాడు.

"ఏ పిల్లరా?"

"నగలు పెట్టుకున్న పెళ్ళి కూతురు పిల్ల."

"అది ... అది ... అదీ చచ్చిపోయిందిరా" పెల్లుబుకుతున్న దుఃఖాన్ని నొక్కి పెడుతూ పలికాడు.

"మరి నేనెందుకు బతికున్నాను?"

రంగడి ప్రశ్నకు సమాధానం దొరకని పంతులు నిశ్చేష్టుడైపోయాడు.

* * * *

తనూ ఓ మనిషిగా బ్రతకాలని, చిట్టితో సుఖంగా జీవించాలన్న రంగడి కలలు నిజం కాలేదు గానీ తన పాత జీవితంలోనే మరో చిత్రం జరిగింది.

అదే ఇప్పుడు తనకి ధర్మం చేసేవాళ్ళు ఈ సడించుకోవడం లేదు. 'యెదవా ... గాడిదా ... దున్నపోతా కష్టపడి పనిచేసుకు బ్రతకరాదు అనడంలేదు. "అయ్యో పాపం ... అని కుంటి కాళ్ళ వంక చూస్తూ ఉదారంగా దానం చేసేస్తున్నారు.

ఇదివరకటి కంటే ఆదాయం మూడింతలైంది. ఐస్ క్రీములు, సినిమాలకు కొదవ లేదు. అయితే తనను ఈసడించుకుంటున్న వ్యక్తి ఉంది.

అదే ... చిట్టీ.

"ఛీ కుంటెదవ" అన్నప్పుడల్లా తన నవనాడులూ కుంగిపోతు ఉన్నాయి. గతంలో అంతమంది అన్ని తిట్టినా బాధ అనిపించలేదు. రెండు కాళ్ళూ పోయినందుకూ పెద్దగా బాధపడలేదు. కానీ చిట్టీ .... చిట్టీ ... ఇక రంగడు ఆలోచించడం మానుకున్నాడు.